క్లుప్తంగా

సుంకేసుల డ్యాం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు



రాజోళి: రాజోళి శివారులో గల సుంకేసుల డ్యాం దగ్గర పశు సంవర్ధక శాఖ అధికారులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. గురువారం ఏర్పాటు చేసిన ఈ చెక్‌పోస్టు బక్రీద్ పండుగ ముగిసేదాకా ఉంటుందని తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు, వాటిపై తనిఖీలు చేపట్టేందుకు ఈ చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం నుంచి సంబంధిత శాఖ అధికారులు విధులు కేటాయించగా.. వీఎల్‌ఓ వరప్రసాద్ మొదటిరోజు విధుల్లో పాల్గొన్నారు. గ్రామాల్లో ఎవరికైనా ఆవులను అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిస్తే.. తమ దృష్టికి తీసుకురావాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోండి

అయిజ: ప్రతి ఒక్క రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి లోకరాజు అన్నారు. గురువారం మండలంలోని ఉత్తనూరు గ్రామంలో ఆయన రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకునేందుకు రైతు ఆధార్ కార్డు, పొలం పాస్ బుక్కు, ఆధార్ కార్డుకు లింక్ అయిన మొబైల్ నంబర్ ఇవ్వాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

కేటీదొడ్డి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉమిత్యాల గ్రామంలోని లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిర్మ ఇళ్ల పనులు త్వరగా ప్రారంభించాలని లేకపోతే ఇళ్లను రిజెక్ట్ చేస్తామని సూచించారు. దీంతో లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించడానికి తమకు 15 రోజులు గడువు ఇవ్వాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

మద్యం సేవించి వాహనాలు నడపరాదు

ధరూరు : వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపితే చర్యలు తప్పవని మండల ఎస్సై శ్రీహరి హెచ్చరించారు. వాహన తనిఖీల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని చింతరేవులలో వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంకన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ద్విచక్ర వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడాలి

అయిజ: ప్రతి భారతీయుడు సనాతన ధర్మం గురించి తెలుసుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తొత్తినోనిదొడ్డి గ్రామంలో హనుమాన్ జయంతిని పుస్కరించుకొని బీజేపీ నాయకులు సనాతన ధర్మంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ఏకైక హిందూ దేశం భారతదేశమని అన్నారు. ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని కాపా డాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, కార్యకర్తలు రాజేష్, నరసన్న గౌడ్, శశికుమార్, వెంకటేష్, నరసింహులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెట్లను తొలగించండి సారూ..



మానవపాడు: అకాల వర్షాలు, ఈదురుగాలులకు రోడ్డుకు అడ్డంగా నేలకొరిగిన చెట్లను తొలగించకపోవడంతో వాహనదారలు ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం మండల కేంద్రంలోని బ్యాంక్ కార్యాలయానికి వెళ్లే దారిలో సహకార సంఘం వద్ద ఉన్న వేప చెట్లు ఈదురుగాలులకు నేలకొరిగింది. పక్కనే విద్యుత్ స్తంభం ఉండడంతో ఏ ప్రమాదం జరగక ముందే నేలకొరిగిన చెట్టును తొలగించి ప్రయాణికులకు ఇబ్బంది తొలగించాలన స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ పూజలు



రాజోళిలోని స్వామివారికి పల్లకీసేవ చేస్తున్న భక్తులు

రాజోళి: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. వైకుంఠ నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోగల కోట వీధి అంజనేయస్వామి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి తుంగభద్ర నది నుంచి బిందె సేవ కార్యక్రమం, ఆకు పూజ, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారి భజన, సంకీర్తనలు చేయగా రాజోళి గ్రామం రామనామంతో మార్మోగింది. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

శాంతినగర్: వడ్డేపల్లి పట్టణం, మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వడ్డేపల్లి ఆంజనేయస్వామి ఆలయం, మారుతీనగర్, జూలెకల్ ఆర్డీఎస్ కెనాల్ సమీపంలోని అభయాంజనేయ స్వామివారి ఆలయం, కొంకల, రామాపురం, తనగల గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగాయి. ఉదయం స్వామివారి మూల విరాట్‌కు జలాభిషేకం, పంచామృతాభిషేకం, సింధూరాభిషేకం, ఆకుల పూజలు జరిపించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ, ప్రసాదాలు పంచి ఆశీర్వచనాలు అందించారు. నిర్వాహకులు అన్నదానం చేశారు.

అయిజ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి నైవేద్యం సమర్పించారు. మండలంలోని కిష్టాపురంలో భక్తులు ఆంజనేయస్వామి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని వెంకటాపురం వరకు ఊరేగించారు.

మానవపాడు: విశ్వహిందూ పరిషత్ సభ్యులు మండల కేంద్రంలోని అడవి ఆంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజలు చేసి హనుమాన్ విగ్రహనికి అభిషేకాలు నిర్వహించారు. రాత్రి ఆంజనేయస్వామి ఆలయం నుంచి మండల కేంద్రానికి హనుమాన్ విగ్రహన్ని ఊరేగింపు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇటిక్యాల: మండల కేంద్రంతో పాటుగా పెద్దదిన్నె వేంకటేశ్వర స్వామి ఆలయంలో అంజనేయస్వామికి పంచామృతాభిషేకం, ఆకుపూజ చేశారు. అనంతరం అర్చకులు హనుమాన్‌చాలీసా పారాయణం, సందర కాండ పారాయణం చేసి భక్తులకు హనుమాన్ చరిత్ర, బుద్ధి బలం గురించి వివరించారు.



కిష్టాపురంలో..



వడ్డేపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో..



మానవపాడులో..

రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ భరత్ సింహ

కేటీదొడ్డి: రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఈఓ భరత్ సింహ హెచ్చరించారు. గురువారం మండలంలో చింతలకుంటలోని రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులందరూ గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తన ప్యాకెట్‌పై ఉన్న లేబుల్ కంపెనీ పేరు గడువు తేదీ వంటి వివరాలు కచ్చితంగా పరిశీలించిన తర్వత విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

అలంపూర్ : రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్ అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలో విత్తన విక్రయ దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని విత్తనాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. దుకాణా నిర్వాహకులు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయలన్నారు. అలాగే విత్తనాలు అమ్మిన రైతులకు తప్పక రశీదు ఇవ్వాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి నాగార్జున్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థ రూపుమాపాలి



మల్దకల్ : బాలకార్మిక వ్యవస్థను పూర్తి స్థాయిలో నిర్మూలించడం మన అందరి బాధ్యత అని బాలల సంరక్షణ ప్రతినిధి ప్రకాష్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దొడ్డిలో శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే గ్రామాలలో బడి ఈడు పిల్లలతో రైతులు సీడ్‌పత్తి పనులు చేయించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ సభ్యులు కళావతి, సరోజ, ప్రకాష్, విజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

రాజోళి: మండలంలోని పెద్దతాండ్రపాడులో శుక్రవారం జరగనున్న వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని జయప్రదం చేయాలని వాల్మీకి సంఘం నాయకులు ఒక ప్రకటనలో కోరారు. అన్ని వర్గాల వారికి ఆదర్శప్రాయుడైన వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని, జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతు



మరమ్మతు చేయిస్తున్న అధికారులు

గట్టు: మండలంలోని బండమీదిగేరిలో మిషన్ భగీరథ పైపు లీకేజీ అవుతున్నట్లు సాక్షిలో ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. గురువారం మిషన్ భగీరథ ఏఈ విశ్వచైతన్య, కార్యదర్శి మునినాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మంజూర్ అహ్మద్‌లు బండమీదిగేరిని సందర్శించి పైపులైనుకు మరమ్మతు చేయించారు. డ్రైనేజీ కాలువ వద్ద లీకవుతున్న పైపును తొలగించి దాని స్థానంలో ఇనుప పైపును ఏర్పాటు చేశారు.

అటవీ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు



ముసలంపల్లి అటవీ భూముల్లో మట్టి తవ్వకాలు

- ముసలంపల్లిలో గుట్టుగా మట్టి తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు
- చెట్లను సైతం తరలిస్తున్న అక్రమార్కులు



అటవీ భూముల్లో చదును చేసిన పొలం

గట్టు : కాదేదీ కబ్జాకు అనర్హం అంటూ అక్రమార్కులు మట్టిని కూడా వదలడం లేదు. గట్టు మండలంలోని ముసలంపల్లి అటవీ భూముల్లోని ఎర్ర మట్టిని తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. అటవీ భూముల్లో మట్టి తవ్వకాలపై నిషేధం ఉన్నా ఇవేమీ ఇక్కడ పని చేయడం లేదు. ఎవరికి వారు తమకు తోచిన విధంగా ఎర్ర మట్టిని గుట్టుగా తరలించుకుపోయి సొమ్ము చేసుకుంటున్నారు. మాచర్ల, చింతలకుంట గ్రామాల మధ్య ముసలంపల్లి రిజర్వు ఫారెస్టు భూములున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇక్కడ తప్పా మరెక్కడా అటవీ భూములు లేవు. దీంతో ఇదే అదనుగా రిజర్వు ఫారెస్టు భూముల్లోని ఎర్ర మట్టిని కొందరు అక్రమార్కులు గుట్టు చప్పుడు కాకుండా రాత్రికి రాత్రే ట్రాక్టర్ల ద్వారా తరలించుకుపోతున్నారు. ఇష్టం వచ్చినట్లు ఎక్కడ పడితే అక్కడ మట్టిని తవ్వి తీసుకుపోతున్నారు. చీకటి పడితే చాలు అటవీ భూములపై నిఘా లేకపోవడంతో ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నట్లు మాచర్ల, చింతలకుంట గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అటవీ భూముల్లో మొక్కల పెంపకానికి అధికారులు ఇటీవల ప్రత్యేక చర్యలు చేపట్టారు. అయితే మట్టి తవ్వకాల కారణంగా కొత్త చెట్ల సంగతి అటుంచితే ఇప్పటి దాకా కష్టపడి పెంచిన మొక్కలు సైతం కనుమరుగవుతున్నాయి.

అటవీ భూముల చదును

రిజర్వు ఫారెస్టు మధ్యలో ఉన్న అటవీ భూములను ఇటీవల కొందరు సాగుకు అనుకూలంగా చదువు చేసుకుంటున్నారు. వర్షాకాలం మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న తరుణంలో ఫారెస్టులోని భూములను చదును చేస్తుండడంతో రిజర్వు ఫారెస్టు ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. చెట్లను తొలగించి అటవీ భూములను చదును చేస్తున్నప్పటికీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కలప సైతం మాయం

ఇప్పుడిప్పుడే ముసలంపల్లి అటవీ సంపద వృద్ధి చెందుతున్న తరుణంలో కొందరు కేటుగాళ్లు ప్రకృతి సంపదను రాత్రికి రాత్రే సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇలా అడవిలోని కలపను గుట్టుగా తరలిస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి మట్టిని తరలించే వారిపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

అటవీ భూముల్లో ఎలాంటి తవ్వకాలు, చెట్ల తరలింపునకు అనుమతి లేదు. ఎవరైనా మట్టిని, కలపను అక్రమంగా తరలించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అటవీ భూములపై, అటవీ సంపదపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. గట్టు మండలం ముసలంపల్లి అటవీ భూముల్లో మట్టి తరలింపు, కలప తరలింపు వ్యవహారం తన దృష్టికి రాలేదు. ఈ వ్యవహారంపై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

–ఫర్విజ్ అహ్మద్, ఎఫ్‌ఆర్‌ఓ, గద్వాల

బాలల సంరక్షణ అందరి బాధ్యత



బాలల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గద్వాల: బాల, బాలికలను సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ శివలీల అన్నారు. గురువారం గద్వాల మండలం చెనుగోనిపల్లిలో మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంక్షేమంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. 18 ఏళ్లలోపు బాల, బాలికలను పనుల్లో పెట్టుకోవడం, బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాలల సంరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొదించినట్లు తెలిపారు. ఎక్కడైనా బాల, బాలికల చేత పనులు చేయించినా, బాల్య వివాహాలు చేసినా 1098కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దస్తగిరి, నాగరాజు, కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు

యల్లందొడ్డిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



బొడ్రాయి ప్రతిష్ఠను నిర్వహిస్తున్న గ్రామస్తులు

గట్టు: యల్లందొడ్డి గ్రామంలోని కొలువైన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. మల్దకల్ రమేష్‌చారి ఆధ్వర్యంలో 31 అడుగుల ధ్వజస్తంభం, అష్టదిగ్బంధనం, బొడ్రాయి, 25 ఫీట్ల శిలా గోపురం శిఖరం ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం దగ్గర హోమాలు, ప్రాణప్రతిష్ఠలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు బల్గెర హనుమంతు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నాయకులు రామునాయుడు, భాస్కర్, గోపాల్, ఆంజనేయులు, బజారి, తిమ్మప్ప, అమ్రేష్ తదితరులు ఉన్నారు.

జీలుగతో భూసారం పెంపు



రైతులకు జీలుగ విత్తనాలు ఇస్తున్న అధికారులు, నాయకులు

అయిజ: రైతులు జీలుగ పంట సాగుచేసి భూసారాన్ని పెంచుకోవాలని అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి జనార్దన్‌తో కలిసి రైతులకు సబ్సిడీ జీలుగ విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వింటాల్ జీలుగ విత్తనాల ధర రూ.14,250 కాగా 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. హెక్టార్‌కు 30 కేజీల సరిపోతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు లోకరాజు, సతీష్, పీఏసీఎస్ కార్యదర్శి మల్లేష్, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సరిత

ధరూరు: మండల పరిధిలోని అల్వాలపాడులో మాజీ ఎంపీటీసీ దుబ్బన్న గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సరిత గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డీఆర్ శ్రీధర్, శ్రీనివాస్ గౌడ్, పటేల్ శ్రీనివాసులు, ఆనంద్ గౌడ్, సుదర్శన్, బీసన్న, కర్రెన్న పాల్గొన్నారు.

ఘనంగా భాగ్యరెడ్డివర్మ జయంతి వేడుకలు



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులర్పించిన విజయభూపాల్ రెడ్డి



ఇటిక్యాలలో..

ధరూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భాగ్యరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ విజయ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో భాగ్యరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ దక్కన్ దళిత ఉద్యమ వైతాళికుడిగా పేరు గాంచిన భాగ్యరెడ్డి అనే మహనీయుడు దళిత జాతి అభ్యున్నతికి ఎనలేని సేవలు చేశారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీటీ అలివేలు మంగమ్మ, ఆర్ఐలు తేజ, రవి, రేషన్ డీలర్లు వేమారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు: గట్టు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం భాగ్యరెడ్డి వర్మ జయంతిని ఘనంగా జరుపుకున్నారు.అదనపు గిర్దావర్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయం ఉద్యోగులు భాగ్యరెడ్డి వర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భాగ్యరెడ్డి వర్మ బాలికల సంక్షేమానికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ షేక్షావలి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మ ఆశయాలను కొనసాగించాలి

ఇటిక్యాల: దళిత ఉద్యమ నేత వైతాళికుడు మాదిరి భాగ్యరెడ్డివర్మ ఆశయాలను కొనసాగించాలని తహసీల్దార్ వీరభద్రప్ప అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ నందిని, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులతో బోధించాలి



అలంపూర్‌లో మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్

అలంపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నూతన పద్ధతులతో బోధన చేయాలని కోర్సు డైరెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు మూడో రోజు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ సబ్జెక్టుపై శిక్షణ ఇచ్చారు. కోర్సు డైరెక్టర్ మాట్లాడుతూ.. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు శ్యాంసన్, పద్మనాభశాస్త్రి, శ్రీనివాసులు, రాజ్‌కుమార్, నాగరాజు, పెద్దయ్య నాయుడు, వీరేషప్ప, ఎల్లక్రిష్ణ తదితరులు ఉన్నారు.

అలంపూర్ చౌరస్తాలో..

అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి పాఠశాలలో ఉపాధ్యాయులకు మూడో రోజు శిక్షణ కొనసాగిందని కోర్సు డైరెక్టర్లు శివప్రసాద్, రామక్రిష్ణ అన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జ్‌లు హేమలత, అనితబాయి, ఆర్పీలు రాణి, శాలం, విజయభాస్కర్‌రెడ్డి, గజరాజు, సత్యనారాయణ మూర్తి, మక్బూల్, కుమార్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందా జగన్నాథానికి ఘన నివాళి



ఎర్రవల్లి: మండలంలోని కొండేరులో గురువారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎంపీ మంధా జగన్నాథం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కూడలిలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అలంపూర్ అధ్యక్షుడు ఉపేంద్రబాబు, యోహన్, బజారన్న, బీసన్న, రాజు, మహారాజ్, సతీష్, రవి, మధు, లాజర్, తదితరులు ఉన్నారు.